


# దడుపు జ్వరం... మందులతో తగ్గుతుందా?

నా వయసు 20. నాకు ఐదారేళ్లుగా... చలికాలం వస్తే చాలు చర్మం పగిలి తెల్లగా పొడలు పొడలుగా అవుతోంది. ఈ సమస్య ముఖం, కాళ్లు, చేతుల మీద చాలా ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో నలుగురిలో తిరగడానికి ఇబ్బందిగా ఉంటోంది. దీనికి హోమియోలో చికిత్స ఏమైనా ఉంటే సూచించండి.

– ఉమ, వైజాగ్

చలికాలం చర్మం ఎండిపోయి, పగిలిపోవడం అందరిలోనూ సాధారణంగా కనిపిస్తుంది. దీనికి ముందుజాగ్రత్తగా కొబ్బరినూనె లేదా మాయిశ్చరైజర్లను చర్మం మీద పైపూతలాగా రాయండి. హోమియోలో పెట్రోలియం అల్యూమినా అనే మందును వాడవచ్చు. చర్మం బాగా పగిలినప్పుడు, సమస్య తీవ్రతను బట్టి పెట్రోలియమ్ 30పొటెన్సీలో రోజుకు రెండుపూటలా వాడండి. దురద ఎక్కువగా ఉంటే ఒంటికి నువ్వులనూనెను పూయండి.

మా అబ్బాయికి పదేళ్లు. ఈ మధ్య మేము పిల్లలతో పాటు ఒక మాల్‌లో స్కేరీహౌస్‌కి వెళ్లాం. అక్కడ అందరు పిల్లలతోపాటు మా అబ్బాయి కూడా స్కేరీహౌస్‌కి వెళ్లివచ్చాడు. అయితే ఆ తర్వాత చాలా భయపడ్డాను అని చెప్పి ఏడ్చాడు. ఆ రోజు రాత్రి నుంచి వాడికి జ్వరం. పక్క తడ పటం కూడా మొదలైంది. పదిరోజులుగా మందులు వాడుతున్నాం. ప్రయోజనం కనపడట్లేదు. ఇలాంటి సమస్యలకు హోమియోలో మందులు ఉన్నాయని విన్నాము. తెలియజేయగలరు.

– నాగలక్ష్మి, సిద్ధిపేట

భయం వల్ల కలిగే అన్నిరకాల సమస్యలను హోమియో మందుల ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు. మీరు ప్రస్తుతం ఎకోనైట్ 1 ఎం. పొటెన్సీలో ఒక్క డోస్ వేసి సాక్రమ్ లాక్టిస్ రెండుపూటలా వాడండి. సమస్య తీవ్రతను బట్టి హోమియో వైద్యుని సంప్రదిస్తే మంచిది.

నా వయసు 55. నాకు కొంతకాలంగా యుటెరస్ నుండి బ్లీడింగ్ అవుతోంది. స్కానింగ్ రిపోర్ట్‌లో ఫైబ్రాయిడ్స్ ఉన్నాయని చెప్పారు. ఆపరేషన్ ద్వారా యుటెరస్‌ను పూర్తిగా తొలగించడమొక్కటే మార్గమని గైనకాలజిస్ట్ చెప్పారు. ఆపరేషన్ అంటే నాకు భయం. కాబట్టి హోమియో మందులతో ఫైబ్రాయిడ్స్ తగ్గే అవకాశం ఏమైనా ఉంటే చెప్పగలరు.

– కోటేశ్వరి, పిడుగురాళ్ల

మీరు ఫ్రాక్సినస్ అమెరికానా అనే మదర్ టింక్చర్‌ను ఉదయం సాయంత్రం 15–20 చుక్కలు నీటిలో కలుపుకుని తాగండి. కొంచెం ఉపశమనం కలుగుతుంది. హోమియోపతి మందుల ద్వారా ఫైబ్రాయిడ్స్‌ను పూర్తిగా తొలగించడం అనేది ఫైబ్రాయిడ్స్ పరిమాణం, సంఖ్య, అవి ఏర్పడటానికి గల కారణాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి నిపుణులైన హోమియో వైద్యుని సంప్రదించడం మంచిది.



డాక్టర్ రాజశేఖర్, ఫ్యామిలీ హోమియోపతి